కస్టమర్ల విశ్వాసానికి.. పారదర్శక విధానాలకు.. ప్రతిరూపం
MESARA Infra Developers Limited

# BNS BHARAT NEWS SPECTRUM

ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కస్టమర్ల విశ్వాసానికి.. పారదర్శక విధానాలకు.. ప్రతిరూపం
MESARA Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -148 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 10-06-2026 బుధవారం పేజీలు : 4

# వైరల్ ఫీజుల వెనుక వాస్తవం!

- రూ.19 వేల ఫీజు వార్త వైరల్
- సోషల్ మీడియాలో ఫీజుల హడావిడి
- రాష్ట్రవ్యాప్త ఫీజు ఫిక్స్ కాలేదు
- వైరల్ జాబితాలో నిజం ఎంత?
- ప్రతి స్కూల్‌కు వేర్వేరు ఫీజులు
- ఒకే రూల్ అన్నది అపోహే
- ఫీజులు నిర్ణయించేది కమిటీ
- మౌలిక వసతులే కీలకం
- రికార్డులు చూసి ఆమోదం
- మూడేళ్లకు ఫీజు నిర్ణయం
- గ్రామీణ, నగర స్కూళ్లకు తేడా
- కొన్ని చోట్ల రూ.60 వేలకుపైగా
- వైరల్ ఫీజులు అందరికీ కావు
- నోటీస్ బోర్డుల్లో అసలు వివరాలు
- ఫీజు తెలుసుకోవాలంటే వెబ్‌సైట్ చూడాలి




**న్యూస్ డెస్క్, 09 జూన్ (బివిఎస్):** తమిళనాడులోని ప్రైవేట్ పాఠశాలలు తమ ట్యూషన్ ఫీజు వివరాలను జూన్ 5వ తేదీ లోపు నోటీస్ బోర్డులపై, అధికారిక వెబ్‌సైట్లలో బహిరంగంగా ప్రదర్శించాలంటూ విద్యాశాఖ జారీ చేసిన తాజా ఉత్తర్వులు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యంగా మధ్యతరగతి, పేద విద్యార్థులకు మేలు చేస్తూ ప్రభుత్వం ఫీజులను అదుపులోకి తెచ్చిందనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో ఎల్‌కేజీ నుంచి 12వ తరగతి వరకు ఒక నిర్దిష్ట ఫీజు పట్టిక వైరల్‌గా మారింది. వీటి ప్రకారం ఐదో తరగతి లోపు రూ.19 వేల ఫీజు మాత్రమే వసూలు చేయాలని ఉంది. కానీ ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం ఒకే రకమైన ఫీజుల విధానాన్ని అమలు చేయబోతోందనే ప్రచారంలో అస్సలు నిజం లేదని స్పష్టం చేస్తున్నారు.

**ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్న ఫీజుల పట్టిక ఇదే..!**

ఎల్‌కేజీ, యూకేజీలకు రూ.16,640, ఒకటి నుంచి 5వ తరగతి వరకు రూ.18,635, 6 నుంచి 8వ తరగతి వరకు రూ.20,635, 9, 10వ తరగతులకు రూ.22,965 ఫీజును తమిళనాడు సర్కారు ఖరారు చేసిందని వార్తలు వైరల్ అవుతున్నాయి. అలాగే 11, 12వ తరగతులకు గాను రూ.25,825 ఫీజు మాత్రమే వసూలు చేయబోతున్నారంటూ ప్రచారం సాగుతోంది. ఇవే ఫీజులు రాష్ట్రంలోని ఏన్ని ప్రైవేటు బడులు, కాలేజీల్లో ఉంటుందని చెబుతున్నారు. కానీ దీంట్లో ఎంత మాత్రమూ నిజం లేదని నిపుణులు వివరిస్తున్నారు.

మిగతాది 2 లో..


## స్టీల్ ప్లాంట్ మృతులకు భారీ ఆర్థికసహాయం ప్రకటించిన డిప్యూటీ సీఎం పవన్




**న్యూస్ డెస్క్, 09 జూన్ (బివిఎస్):** విశాఖ స్టీల్ ప్లాంట్ లో మెటల్ లిక్విడ్ లాడిల్ పేలడంతో జరిగిన ప్రమాదంలో 8 మంది కార్మికులు చనిపోవడం బాధాకరమని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో బాధితులను పరామర్శించిన అనంతరం.. స్టీల్ ప్లాంట్ కు వెళ్లిన ఆయన అక్కడ ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు.

## నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు.. విభజన హామీలపై చర్చ

**న్యూస్ డెస్క్, 09 జూన్ (బివిఎస్):** సీఎం చంద్రబాబు నాయుడు రెండ్రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. జూన్ 10, బుధవారం ఉదయం 11.30 గంటలకు గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి స్పెషల్ ఫ్లైట్ లో ఢిల్లీకి బయల్దేరనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశానికి హాజరుకానున్నారు.




## 100కు చేరిన ఎబోలా మృతులు




**న్యూస్ డెస్క్, 09 జూన్ (బివిఎస్):** ఆఫ్రికాలో ఎబోలా మరణాలు 100 కు చేరాయి. ఆఫ్రికా దేశమైన డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఎబోలా వైరస్ మహమ్మారి వేగంగా విస్తరిస్తోంది. అధికారిక గణాంకాల ప్రకార.. జూన్ 8 నాటికి అక్కడ ఎబోలా పాజిటివ్ కేసుల సంఖ్య 550కి చేరగా, ఇప్పటివరకు 101 మంది మరణించారు. కేవలం గత 24 గంటల్లోనే కొత్తగా 35 పాజిటివ్ కేసులు, 10 మరణాలు నమోదు కావడం వ్యాధి తీవ్రతను తెలియజేస్తోంది.

## అదనంగా రూ.25 లక్షలు


### మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తాం!




**న్యూస్ డెస్క్, 09 జూన్ (బివిఎస్):** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం విశాఖపట్నంలో పర్యటించారు. విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన.. అక్కడి నుంచి నేరుగా నగరంలోని సెవెన్ హిల్స్ ఆస్పత్రికి వెళ్లి ప్రమాదంలో గాయపడిన కార్మికులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని.. మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చేరుకున్న లోకేశ్.. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అధికారులతో సమావేశమై ప్రమాదానికి గల కారణాలపై వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి నారా లోకేశ్.. స్టీల్ ప్లాంట్‌లో ఇలాంటి ప్రమాదం జరగడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## క్యూబాలో 150 ఏండ్లలోనే అత్యంత భారీ భూకంపం




## ప్రయివేట్ స్కూళ్ల ఫీజులను నియంత్రించాల్సిందే : బీఆర్ఎస్ ధర్నా




**న్యూస్ డెస్క్, 09 జూన్ (బివిఎస్):** ప్రయివేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణపై బీఆర్ఎస్ నాయకులు భారీ ధర్నాకు దిగారు. హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో ఉన్న పాఠశాల విద్యాశాఖ సంచాలకుల ఆఫీసు ఎదుట బీఆర్ఎస్ నాయకుల నిరసనలు, నినాదాలతో హోరెత్తిపోతోంది. రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా పెరుగుతున్న ఫీజులను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందంటూ బీఆర్ఎస్ శ్రేణులు ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. తెలంగాణ విద్యా సంస్థల చట్టాన్ని తక్షణమే పూర్తి స్థాయిలో అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## ఎన్నికల రిజర్వేషన్ల వివాదం

### పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో హింసాత్మక ఘర్షణల్లో 11 మంది దుర్మరణం

**న్యూస్ డెస్క్, 09 జూన్ (బివిఎస్):** పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో హింసాత్మక ఘర్షణలు చోటు చేసుకున్నాయి. జూలై 27న జరగబోయే పిఓకే శాసనసభ ఎన్నికలలో, స్థానికేతర శరణార్థుల కోసం 12 సీట్లను రిజర్వ్ చేయాలని పాకిస్తాన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల తమ స్థానిక హక్కులు దెబ్బతింటాయని వారు ఆందోళన చెందుతూ నిరసనలకు పిలుపునిచ్చారు. 'జమ్మూ కాశ్మీర్ జాయింట్ అవామి యాక్షన్ కమిటీ' ఆధ్వర్యంలో ఉధృత నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలో, గతంలో జరిగిన ఘర్షణల్లో మరణించిన ఒక నిరసనకారుడి అంత్యక్రియల వేళ హాస్పిటల్ వెలుపల గుమికూడిన వేలాది మందిపై పాక్ పోలీసులు, పారామిలటరీ దళాలు ఒక్కసారిగా తుపాకులతో విరుచుకుపడ్డాయి. ఈ దారుణ కాల్పులు, ఎదురుదాడి ఫలితంగా కనీసం 11 మంది (7 గురు పౌరులు, 4 గురు పోలీసులు) అక్కడికక్కడే మరణించగా, 70 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. అయితే మరణాల సంఖ్య మరింత ఎక్కువగా ఉండవచ్చని స్థానిక సంస్థలు ఆరోపిస్తున్నాయి.







# స్టీల్ ప్లాంట్ మృతులకు భారీ ఆర్థికసహాయం ప్రకటించిన డిప్యూటీ సీఎం పవన్



న్యూస్ డెస్క్, 09 జూన్ (బిఎన్ఎస్): విశాఖ స్టీల్ ప్లాంట్ లో మెటల్ లిక్విడ్ లాడిల్ పేలడంతో జరిగిన ప్రమాదంలో 8 మంది కార్మికులు చనిపోవడం బాధాకరమని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో బాధితులను పరామర్శించిన అనంతరం.. స్టీల్ ప్లాంట్ కు వెళ్లిన ఆయన అక్కడ ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనపై ముగ్గురు వ్యక్తులతో కూడిన కమిటీ వేశామని, త్వరలోనే కమిటీ దీనిపై నివేదిక ఇస్తుందన్నారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధిత వ్యక్తుల చికిత్స ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. క్షతగాత్రులతో మాట్లాడినపుడు గతంలో ఇలాంటి ఘటనలు జరిగాయా అని అడగ్గా.. లేదని చెప్పారన్నారు. చైనా, ఫ్రాన్స్ వంటి దేశాల్లో కంపెనీల్లో ప్రమాదాలు జరిగాయి కానీ.. ఈ తరహా ప్రమాదాలు జరగలేదని తెలిసిందన్నారు. త్వరలోనే స్టీల్ ప్లాంట్ కార్మికులతో సమావేశమై.. వారి సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. ప్రతీ కార్మికుడు రిటైర్మెంట్ వరకూ స్టీల్ ప్లాంట్ క్వార్టర్స్ లోనే ఉండొచ్చన్నారు.

ప్రమాద ఘటనలో యాజమాన్యం నిర్లక్ష్యం ఎంతమేర ఉందన్నదానిపై విచారణ జరుగుతోందని పవన్ కల్యాణ్ తెలిపారు. యాజమాన్యాలు సేఫ్టీ ఆడిట్ ఎంతవరకూ చేస్తున్నాయి? చిన్న చిన్న లోపాలుంటే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారా ? వయోలేషన్స్ పై యాక్షన్ తీస్కున్నారా? వయోలేషన్స్ ఉన్నాయని చెప్పినా ఎవరూ రెస్పాండ్ కాలేదని కార్మికులు చెప్తున్నారని పేర్కొన్నారు. వీటన్నింటిపై నేరుగా కార్మికులతోనే చర్చిస్తామని, ఒకరోజు వారితో సమావేశమవుతామని తెలిపారు. ప్రమాదంలో మరణించినవారిలో రెగ్యులర్ ఎంప్లాయిస్ కు రూ.1.72 కోట్లు, కాంట్రాక్ట్ కార్మికుడికి రూ.45.75 లక్షలు, మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు అందజేస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు.

# నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు.. విభజన హామీలపై చర్చ



న్యూస్ డెస్క్, 09 జూన్ (బిఎన్ఎస్): సీఎం చంద్రబాబు నాయుడు రెండ్రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. జూన్ 10, బుధవారం ఉదయం 11.30 గంటలకు గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి స్పెషల్ ఫ్లైట్ లో ఢిల్లీకి బయల్దేరనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశానికి హాజరుకానున్నారు. గురువారం.. రాష్ట్రపతి భవన్లో నిర్వహించే నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ఉదయం 9.15 గంటలకు ఈ సమావేశం ప్రారంభమై.. సాయంత్రం 5 గంటల వరకూ కొనసాగనుంది. ఈ సమావేశంలో త్వరలో జరగనున్న కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల పాత్ర, భవిష్యత్ రాజకీయ వ్యూహాలు, రాష్ట్రాల అభివృద్ధి ప్రణాళికలపై కూడా చర్చలు జరగనున్నట్లు సమాచారం. వీటితోపాటు ఏపీకి సంబంధించిన కీలక అంశాలు, రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్ర సహాయ నిధులు, పెండింగ్ లో ఉన్న విభజన హామీలపై సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర అధినాయకత్వంతో చర్చించే ఛాన్సున్నట్లు తెలుస్తోంది.

# ఎన్నికల రిజర్వేషన్ల వివాదం

## పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో హింసాత్మక ఘర్షణల్లో 11 మంది దుర్మరణం

మొదటి పేజీ తరువాయి



ఈ హింసాత్మక ఘటనా పరిణామాల నేపథ్యంలో పాక్ ప్రభుత్వం ఆ ప్రాంతంలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేసి హై అలర్ట్ ప్రకటించింది. తమ కనీస అవసరాలైన గోధుమలు, విద్యుత్ సబ్సిడీలను పక్కనపెట్టి, తమ రాజకీయ హక్కులను కాలరాస్తూ పాక్ సైన్యం సామాన్య పౌరులపై బుల్లెట్ల వర్షం కురిపిస్తోందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కడ శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించడంతో బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలు తమ పౌరులెవరూ ప్రస్తుతానికి పిఓకే ప్రాంతంలో పర్యటించవద్దంటూ అత్యవసర 'ట్రావెల్ అడ్వైజరీ' (హెచ్చరికలు) జారీ చేశాయి. ఈ ఉద్రిక్తతల మధ్య జూన్ 9 (మంగళవారం) నాడు భారీ బంద్‌కు నిరసనకారులు పిలుపునివ్వడంతో అక్కడ తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# 100కు చేరిన ఎబోలా మృతులు

మొదటి పేజీ తరువాయి



ఈ కొత్త కేసులు అత్యధికంగా 'ఇటురి' ప్రావిన్స్‌లోనే వెలుగుచూస్తున్నాయి. కాంగోలో నెలకొన్న రాజకీయ అస్థిరత, స్థానిక సాయుధ గ్రూపుల ఘర్షణల వల్ల వైద్య సహాయం అందించడం, వ్యాధిని నియంత్రించడం అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలకు పెద్ద సవాలుగా మారింది. కాంగో సరిహద్దులు దాటి పొరుగు దేశమైన ఉగాండాలోనూ కొన్ని ఎబోలా కేసులు నమోదయ్యాయి.

కాంగో నుంచి ఉగాండాకు ప్రయాణించిన వారిలోనే ఈ ఇన్ఫెక్షన్ లక్షణాలు బయటపడటంతో వైరస్ ఇతర దేశాలకు వ్యాపించే ప్రమాదం పొంచివుంది. ఈ తీవ్ర పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఈ ఎబోలా వ్యాప్తిని 'అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితి'గా ప్రకటించింది. ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న 'బుందిబుగ్యో' స్ట్రెయిన్‌కు మార్కెట్‌లో నిర్దిష్టమైన వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడం శాస్త్రవేత్తలను మరింత కలవరపెడుతోంది.

# ప్రయివేట్ స్కూళ్ల ఫీజులను నియంత్రించాల్సిందే : బీఆర్ఎస్ ధర్నా

మొదటి పేజీ తరువాయి





నిబంధనల ప్రకారం వెంటనే ప్రత్యేక ఫీజు నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసి, ప్రైవేట్ స్కూళ్లు ఇష్టారాజ్యంగా పెంచుతున్న ఫీజులపై నియంత్రణ విధించాలని కోరారు.

డొనేషన్లు, రీ-అడ్మిషన్ ఫీజులు, ఇతర అదనపు రుసుముల పేరుతో ప్రైవేట్ యాజమాన్యాలు చేస్తున్న అక్రమ వసూళ్లను అరికట్టాలని స్పష్టం చేశారు. కొత్త విద్యా సంవత్సరం (2026-27) ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలలు ఏటా భారీగా ఫీజులను పెంచుకుంటూ పోతుండటంతో మధ్యతరగతి, పేద తల్లిదండ్రులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీపై ప్రభుత్వం తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# వైరల్ ఫీజుల వెనుక వాస్తవం! రూ.19 వేల ఫీజు వార్త వైరల్

మొదటి పేజీ తరువాయి




**ఒక్కో బడికి ఒక్కో ఫీజు..!**

నిజానికి తమిళనాడు స్కూల్ ఫీజు నిర్ధారణ కమిటీ పని తీరు పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఈ కమిటీ రాష్ట్రంలోని అన్ని స్కూళ్లకు కలిపి ఒకే జనరల్ ఫీజును ప్రకటించదు. దానికి బదులుగా తమిళనాడు ప్రైవేట్ పాఠశాలల చట్టం ప్రకారం.. ప్రతి విద్యా సంస్థను విడివిడిగా పరిశీలిస్తుంది. ఆయా పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతులు, వారు పెట్టే పెట్టుబడి, ఉపాధ్యాయుల జీత భత్యాల ఖర్చులు, స్కూల్ ఉన్న భౌగోళిక ప్రాంతం, రోజువారీ నిర్వహణ వ్యయాలను కమిటీ క్షుణ్ణంగా అంచనా వేస్తుంది. వీటి ఆధారంగానే ప్రతి పాఠశాలకూ ఫీజు నిర్మాణాన్ని కమిటీ ఖరారు చేస్తుంది.

ఈ వ్యవహారంలో కమిటీ ప్రధానంగా మూడు సూత్రాల ఆధారంగా పని చేస్తుంది. ప్రతీ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాల తమ సొంత ఆర్థిక రికార్డులను, తాము వసూలు చేయాలనుకుంటున్న ప్రతిపాదిత ఫీజుల వివరాలను కమిటీకి సమర్పించడం తప్పనిసరి. ఆ రికార్డులను తనిఖీ చేసిన తర్వాతే కమిటీ ఒక నిర్దిష్ట ఫీజు కాలక్రమాన్ని ఆమోదిస్తుంది. ఇది వరుసగా మూడు విద్యా సంవత్సరాల పాటు చెల్లుబాటు అవుతుంది. అలాగే 2026--27 విద్యా సంవత్సరానికి గానూ కమిటీ ఆమోదించిన వివరాలను పరిశీలిస్తే.. ఒకే తరగతికి స్కూళ్లను బట్టి ఫీజుల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయి. కొన్ని చిన్న గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైమరీ స్కూళ్లకు వార్షిక ఫీజు రూ. 10,000 లోపే ఉండగా.. అదే క్లాసు చదివేందుకు నగరాల్లోని ప్రముఖ మెట్రిక్యులేషన్ స్కూళ్లలో ఫీజు రూ. 60,000 దాటింది.

**సర్కారు ఏ బడికి ఎంత ఫీజు పెట్టిందో ఇలా తెలుసుకోవచ్చు..!**

ప్రస్తుతం ప్రచారంలో ఉన్న ఫీజులు.. ఉదాహరణకు ఎల్‌కేజీకి రూ. 16,640, ఇంటర్‌కు రూ. 25,825 ఏదైనా ఒక నిర్దిష్ట పాఠశాలకు కమిటీ కేటాయించినవి మాత్రమే అయి ఉండవచ్చని.. అంతే తప్ప అది రాష్ట్రవ్యాప్త నిబంధన కాదని నిపుణులు తేల్చారు. మరోవైపు కమిటీ ద్వారా ఏ స్కూల్‌కు ఏ ఫీజు అయితే ఆమోదించబడిందో.. ఆ నిర్దిష్ట వివరాలను మాత్రమే సదరు పాఠశాల యాజమాన్యం తమ నోటీస్ బోర్డులపై, వెబ్‌సైట్లలో ఉంచాలని ప్రైవేట్ పాఠశాలల డైరెక్టరేట్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి ఒక పాఠశాల నోటీస్ బోర్డుపై ఉన్న ఫీజులు కేవలం ఆ సంస్థకు మాత్రమే వర్తిస్తాయి. అదే వీధిలో ఉన్న మరో స్కూల్‌కు కమిటీ పూర్తిగా భిన్నమైన ఫీజులను ఆమోదించి ఉండవచ్చు. తల్లిదండ్రులు తమ పిల్లలు చదివే నిర్దిష్ట విద్యాసంస్థకు ప్రభుత్వం ఆమోదించిన అసలు ఫీజు ఎంతో తెలుసుకోవడానికి జిల్లా వారీగా ఉన్న వివరాలను ఫీజు కమిటీ అధికారిక వెబ్‌సైట్ https://tnfeecommittee.com/fees28.php?city=Chennai ద్వారా నేరుగా సరిచూసుకోవచ్చని అధికారులు సూచించారు.

# 'కాక్రోచ్'కు పోటీగా దేశంలో కొత్త పార్టీ అనౌన్స్ చేసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి




న్యూస్ డెస్క్, 09 జూన్ (బిఎన్ఎస్): దేశ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. సోషల్ మీడియాలో కాక్రోచ్ జనతా పార్టీ సంచలనం సృష్టిస్తున్న వేళ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మార్కండేయ కాట్జూ సరికొత్త రాజకీయ పార్టీని ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు.'ఇష్క్ కరో పార్టీ' పేరుతో ఆయన సరికొత్త రాజకీయ ప్రస్తానాన్ని ప్రారంభించారు. ఇది కేవలం వ్యంగ్యంగా పెట్టిన పేరు కాదని.. దేశాన్ని పీడిస్తున్న నిరుద్యోగం, పేదరికం, బాలల్లో పౌష్టికాహార లోపం వంటి తీవ్రమైన సమస్యలపై పోరాడటమే ఈ పార్టీ ముఖ్య ఉద్దేశమని ఆయన ఎక్స్ వేదికగా వివరించారు.

'వాలెంటైన్స్ డే' తరహా ప్రేమ వ్యవహారం కాదు:

'ఇష్క్ కరో పార్టీ' పేరుతో రాజకీయం ప్రారంభించిన కాట్జూ ఈ విచిత్రమైన పేరు వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. కొత్తగా స్థాపించబడిన 'ఐకేపీ' (ఇష్క్ కరో పార్టీ) ఒక జోక్ అని, లేదా యువతీ యువకుల మధ్య ప్రేమను ప్రోత్సహించే ఒక రకమైన వాలెంటైన్స్ డే తరహా ప్రేమ వ్యవహారం కాదని, దేశంలోని విభిన్న వర్గాల మధ్య ఐక్యతను పెంపొందించే సామాజిక తత్వమని ఆయన వివరించారు. ప్రజలందరూ తమ విభేదాలను పక్కనబెట్టి ఒకటైనప్పుడే దేశ సమస్యలు అంతమవుతాయని ఆయన పేర్కొన్నారు. కాగా, ఈ కొత్త పార్టీలోకి రావాల్సిందిగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాకు కాట్జూ బహిరంగంగా ఆహ్వానం పలికారు. ప్రస్తుతం కుల, మత, జాతి ప్రాతిపదికన విభజించబడిపోయామని ఈ చెడును ఎదుర్కొని, మన ప్రజలలో ఐక్యతను పెంపొందించడమే ఐకేపీ లక్ష్యం అన్నారు. కుల, మత, జాతి భేదం లేకుండా మన ప్రజలందరి పట్ల మనకు ప్రేమ (ఇష్క్) ఉండాలని అప్పుడే మన ప్రజలను వారి దయనీయ దుస్థితి నుండి విముక్తి చేయడానికి, ఆధునిక భావాలు గల నాయకుల నేతృత్వంలో మనం ఒక గొప్ప ప్రజా పోరాటాన్ని (జన సంఘర్ష్) చేయగలమన్నారు. ఈ మహత్తర కార్యంలో ఐకేపీ భారత ప్రజలకు మార్గనిర్దేశం చేస్తుందని అదే దీని లక్ష్యం అని తెలిపారు.. ఐకేపీలో చేరడానికి ఆసక్తి ఉన్నవారు ishqkaroparty@gmail.com ను సంప్రదించాలని తెలిపారు. ఇష్క్ కరో పార్టీ పేరు మార్చాలని నెటిజన్లు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చిన కాట్జూ పేరు మార్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

కాక్రోచ్ పార్టీ తీరుపై కాట్జూ విమర్శలు:

ఇటీవల నీట్ పరీక్షల వివాదంపై జూన్ 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'కాక్రోచ్ జనతా పార్టీ', దాని వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే పెద్ద ఎత్తున నిరసన చేపట్టిన వ్యూహాలను కాట్జూ తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న సీజేపీ పార్టీ డిమాండ్ అర్థరహితమన్నారు. ఒకవేళ ఆయన రాజీనామా చేసినా, మరో మంత్రి వస్తారని. తాంతో వ్యవస్థలో వచ్చే మార్పు ఏముంటుందని ప్రశ్నించారు.

# అదనంగా రూ.25 లక్షలు.. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తాం!

మొదటి పేజీ తరువాయి



మృతుల కుటుంబాలకు ఇప్పటికే ప్రకటించిన పరిహారంతో పాటు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి అదనంగా ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని లోకేశ్ తెలిపారు. అలాగే మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాల్లోని పిల్లల భవిష్యత్తు బాధ్యతను కూడా ప్రభుత్వం తీసుకుంటుందని పేర్కొన్నారు. కార్మికులకు భరోసా కల్పించడమే తమ ప్రధాన ఉద్దేశమని మంత్రి చెప్పారు.

ప్రమాదంపై మాట్లాడిన నారా లోకేశ్.. ఉక్కు తయారీ ప్రక్రియలో ఎలాంటి వైఫల్యం లేదని, కెమికల్ రియాక్షన్లలో కూడా లోపాలకు అవకాశం కనిపించలేదని తెలిపారు. అయితే ప్రమాదం ఎందుకు జరిగిందన్న విషయం ఇప్పటికీ సిబ్బందికి, యాజమాన్యానికి పూర్తిగా అర్థం కాలేదన్నారు. ప్రమాదానికి అసలు కారణాలు వెలుగులోకి వస్తే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. స్టీల్ ప్లాంట్ ఆర్థిక పరిస్థితులపై కూడా లోకేశ్ స్పందించారు. ఒకప్పుడు లాభాల్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను గత ప్రభుత్వాల నిర్ణయాలు నష్టాల బాట పట్టించాయని విమర్శించారు. మృతుల అంత్యక్రియలు పూర్తయిన తర్వాత వారి కుటుంబాలను వ్యక్తిగతంగా కలిసి అవసరమైన సహాయంపై చర్చిస్తామని తెలిపారు.

విపత్తు బాధితులను ఆదుకోవడంలో తమ ప్రభుత్వం కేవలం పరిహారం ప్రకటించి మరిచిపోయే విధానం అనుసరించదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఎల్జీ పాలిమర్స్ ప్రమాద బాధితుల కోసం ట్రస్ట్ ఏర్పాటు చేసినది కూడా ఎన్డీఏ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ప్రమాదం జరిగిన ఆరు గంటల్లోనే కేంద్ర మంత్రి కుమారస్వామి ప్లాంట్‌ను సందర్శించారని చెప్పారు. బాధిత కుటుంబాలకు అవసరమైన ప్రతి సహాయం అందిస్తామని, తమ బాధ్యతను పూర్తిగా నిర్వర్తిస్తామని నారా లోకేశ్ హామీ ఇచ్చారు.

# 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




న్యూస్ డెస్క్, 09 జూన్ (బిఎన్ఎస్): రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇవాళ సచివాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఇన్ని టన్నుల ధాన్యం సేకరణ దేశంలోనే సరికొత్త రికార్డు అని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ.35,077 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. మొత్తం 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్థానికంగ ధాన్యం కొనుగోళ్లు జరిగాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో 65.91 లక్షల ఎకరాల్లో 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పడిందన్నారు. అయితే, 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయాలని కేంద్రం చెప్పిందని. తాము 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. మరో లక్ష మెట్రిక్ టన్నులు వారంలో వస్తాయని అన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే వరిలో 61 శాతం తెలంగాణ నుంచే అని తెలిపారు. ఇక ప్రక్క రాష్ట్రం ఏపీ 25 లక్షల మెట్రిక్ టన్నుల వరి మాత్రమే కొనుగోలు చేసిందని వివరించారు. యాసంగి పంటలో పక్క రాష్ట్రాలు అన్ని తమ కన్నా తక్కువ పంటలను కొనగోలు చేశాయని తెలిపారు.

మా కంటే బీఆర్ఎస్, బీజేపీ తక్కువే..

ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీఎస్‌లను బలపరుస్తున్నామని మంత్రి ఉత్తమ్ అన్నారు. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయించి వారికి రూ.171 కోట్లు ఇచ్చామని తెలిపారు. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోల్లు జరగాయని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం తమ కన్నా తక్కువ ధాన్యం కొనుగోలు సేకరించిందని, బీజేపీ పాలిత రాష్ట్రంలో కూడా ఇంత వరి సేకరణ చేయలేదని అన్నారు. పదేళ్లలో ధాన్యం కొనగోళ్లలో బీఆర్ఎస్ రైతలకు రూ.1.35 లక్షల కోట్లు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో రూ.లక్ష కోట్లు ఇచ్చిందని, మళ్లీ తమపైనే అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# క్యూబాలో 150 ఏండ్లలోనే అత్యంత భారీ భూకంపం.. ఇరాన్‌లోనూ!



న్యూస్ డెస్క్, 09 జూన్ (బిఎన్ఎస్): ఫిలిప్పీన్స్‌ను భారీ భూకంపం వణికించిన 24 గంటల్లోనే క్యూబా, ఇరాన్‌లోనూ భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దక్షిణ ఇరాన్‌లోని హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లో 5.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. అదే క్యూబాలో రిక్టర్‌స్కేలుపై 6.1 తీవ్రత నమోదైంది. గత 150 ఏండ్లలో ఆ ప్రాంతంలో సంభవించిన అత్యంత శక్తివంతమైన భూకంపంగా దీన్ని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

భూకంప కేంద్రం క్యూబా పశ్చిమ ప్రాంతంలోని మంటువా పట్టణానికి వాయవ్య దిశలో సుమారు 104 కి.మీ.దూరంలో, భూమికి 26కి.మీ.లోతులో నమోదైందని అమెరికా భూగర్భ సర్వే సంస్థ వెల్లడించింది. సాధారణంగా టెక్టానిక్ ప్లేట్ల సరిహద్దుల్లో పెద్ద భూకంపాలు సంభవిస్తుంటాయి.. అయితే ఈసారి ప్లేట్ల అంతర్గత ప్రాంతంలోనే ఈ భూకంపం సంభవించిందని శాస్త్రవేత్తలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే ఎలాంటి ప్రాణనష్టం, భారీ ఆస్తి నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. మియా

ఈ భూకంప ప్రభావం కారణంగా క్యూబాతో పాటు కరీబియన్ ప్రాంతం, మెక్సికో గల్ఫ్, అమెరికాలోని ఫ్లోరిడా సహా పలు ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. మియామి, ఫోర్ట్ లాడర్‌డేల్, ఆర్లాండో, ఉత్తర ప్రాంతాల వరకు ప్రకంపనలు నమోదయ్యాయి. వీటి కారణంగా పలు ప్రభుత్వ కార్యాలయాలను ముందస్తు జాగ్రత్తగా ఖాళీ చేయించారు. రెండు ఎలివేటెడ్ కమ్యూటర్ రైలు సర్వీసులను తాత్కాలికంగా నిలివేశారు. మెక్సికోలోని యుకటాన్ ద్వీపకల్పం, కాంకూన్, ప్లలాయా డెల్ కార్మెన్, టులుం వంటి పర్యాటక ప్రాంతాల్లోనూ భూప్రకంనలు కనిపించారు.

ఇరాన్‌లో 5.0 తీవ్రతతో భూకంపం

ఇరాన్‌లో మంగళవారం తెల్లవారుజామున 5.0 తీవ్రతతో భూంకంపం సంభవించింది. హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లోని నర్గాజ్ సమీపంలో 22కి.మీ. లోతులో భూకంప కేంద్రాన్ని అధికారులు గుర్తించారు. ఈ ప్రకంపనల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

# నేడు రాపూరులో డైల్ యువర్ డి.యం.



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్) :- నేడు 10-06-2026వతేది రాపూరు డిపో నందు ప్రయాణికుల సౌకర్యార్థం కోసం ఉదయం 11:00గంటల నుంచి12:00 గంటల వరకు "డైల్ యువర్ డి.యం." కార్యక్రమం నిర్వహించబడును అని ఈ పోగ్రామ్ నందు ప్రయాణికులు 9959225651 నెంబర్ కు ఫోన్ చేసి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు సూచనలు, సలహాలు ఇవ్వాలని డిపో మేనేజర్ వై.అనీల్ ప్రకటనలో తెలిపారు.

# సీనియర్ అయ్యప్పస్వామి గురుస్వామి మృతి



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):- నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని 48సంవత్సరాల పాటు అయ్యప్ప స్వామి స్వామి మాలధారణ ధరించి సీనియర్ అయ్యప్పస్వామి గురుస్వామి ముచ్చెలి మునుస్వామి (80)అనారోగ్యంతో గూడూరు పట్టణంలోని ఆయన పెద్ద కుమారిని నివాసంలో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు నేడు అనగా 10వతేది బుధవారం ఉదయం గూడూరులో నిర్వహించనున్నారు అని ఆత్మీయులు తెలిపారు.

# పెంచలకొనలో యోగాంధ్ర కార్యక్రమం



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్):- ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన రాపూరు మండలంలోని పెంచలకొన క్షేత్రంలో వెలసియున్న శ్రీ పెనుశీల లక్ష్మీ నరసింహస్వామి ఆదిలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం నందు 07-06-2026 నుండి 21-06-2026 వరకు జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రీపెనుశీల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం సిబ్బంది మరియు అర్చకులు,భక్తులు కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేయడం జరిగింది.

# పత్రికారంగ అభ్యున్నతికి ఏడాది సేవలు

## ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్‌కు అభినందనల వెల్లువ



లింగంపల్లి (బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఏడాది విజయవంతంగా పూర్తి చేసుకున్న సీనియర్ జర్నలిస్టు ఆలపాటి సురేష్ కుమార్‌కు జర్నలిస్టు సంఘాలు, మీడియా ప్రతినిధులు, ప్రజా సంస్థల నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.తన పదవీకాలంలో జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి నైపుణ్యాల పెంపు, విలువలతో కూడిన జర్నలిజం ప్రోత్సాహం, మీడియా రంగ ఆధునికీకరణకు విశేష కృషి చేశారని పలువురు కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు శిక్షణా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు మీడియా రంగ అభివృద్ధికి పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు.

భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పత్రికారంగానికి మరింత సేవలందిస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ ఆలపాటి సురేష్ కుమార్‌కు శు భాభినందనలు తెలిపారు.

# జిల్లా బిజెపి యువమోర్చ కార్యవర్గంలోకి కొత్తపేట బిజెపి యువ నాయకులు





కొత్తపేట (బిఎన్ఎస్)జూన్ :9 భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం ) కోనసీమ జిల్లా నూతన కార్యవర్గాన్ని (కమిటీని) ఈరోజు ప్రకటించింది. ఈ కమిటీలో కొత్తపేట కి చెందిన కోటిపల్లి దామోదర్ ఉపాధ్యక్షుడిగా, వలపశెట్టి కిరణ్ తేజ్ కార్యదర్శిగా నియమితులవడం పట్ల కొత్తపేట బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ ,రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ రాష్ట్ర యువమోర్చ అధ్యక్షులు సునీల్,జిల్లా యువ మోర్చ అధ్యక్షులు గాణాల రాజరాజేశ్వర కళ్యాణ్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం బిజెపి యువమోర్చ రాష్ట్ర నాయకులు పాలూరి జయప్రకాశ్ నారాయణ,పార్టీ పెద్దల ఆమోదంతో, జిల్లాలోని క్రియాశీలక యువ నాయకులకు ఈ కమిటీలో ప్రాధాన్యత కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు కోటిపల్లి దామోదర్ మాట్లాడు తూ యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేస్తూ కేంద్ర ప్రభుత్వ ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా మా కమిటీ పనిచేస్తుందన్నారు. జిల్లాలో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై యువమోర్చా నిరంతరం పోరాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని నూతనంగా నియమితులైన తెలిపారు.

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వారందరికి కొత్తపేట బిజెపి నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు చెప్పారు..

# నిస్పాక్షికంగా డిఎస్సీ నిర్వహణ..




## టిడిపి జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి

కడపజిల్లా(బిఎన్ఎస్)మే9: అధికారంలోకి వచ్చిన కేవలం 16 నెలల స్వల్ప కాలంలోనే మెగా డీఎస్సీని నిర్వహించి, కూటమి ప్రభుత్వం అంటే ఏంటో ప్రాక్టికల్‌గా నిరూపించామని తెలుగుదేశం పార్టీ కడపజిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కడప నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ నిర్వహణపై వైసీపీ నాయకులు పనిగట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వైకాపాది నిత్యం ఫేక్ బతుకే అంటూ వారి తీరుపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఇంతటి బృహత్తర కార్యక్రమంపై దుష్ప్రచారం చేయడం వైసీపీ నాయకులు తక్షణమే మానుకోవాలని ఆయన హితవు పలికారు.గడిచిన వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు మెగా డీఎస్సీ అనేది ఒక కలగానే మిగిలిపోయిందని,భూపేష్ రెడ్డి విమర్శించారు.ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసిన నిరుద్యోగుల ఆశలను గత ప్రభుత్వం అణచివేసిందనిమండిపడ్డారు.అదే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో,మంత్రి నారాలోకేష్ ఆధ్వర్యంలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి,వేలాది మంది నిరుద్యోగుల కళ్లల్లో ఆనందాన్ని నింపామని భూపేష్ రెడ్డి ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.ఎంతో నిస్పక్షపాతంగా నిర్వహించిన డిఎస్సీ పై ఆరోపణలు మానుకోని పక్షంలో వైకాపాకు నిరుద్యోగులే బుద్ధి చెపుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమర్ నాథ్ రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బొజ్జ తిరుమలేష్, మనోజ్ లు పాల్గొన్నారు.

# "కడప"విజయ దుర్గమ్మ సన్నిధిలో కాలసర్ప దోష ,రాహుకాల పూజలు.



కడపజిల్లా(బిఎన్ఎస్) జూన్ 9: అమ్మా అని పిలిస్తే,నేనున్నా అని పలికే చల్లని తల్లి మన కడప శ్రీ విజయ దుర్గాదేవి ఆ తల్లి సన్నిధిలో మంగళవారం రాహు,కేతు పూజలు ఘనంగా నిర్వహించారు,మంగళ వారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి వేకువ జామున పంచామృత అభిషేకం అనంతరం అమ్మవారిని చక్కగ అలంకరించి,అశేష భక్తులకు ఆలయ అర్చకులు దర్శనాన్నిఅందించారు. అనంతరం మధ్యాహ్నం 3 నుండి 4.30 వరకు రాహు కాల పూజ నిర్వహించారు. గ్రహాలు ఆదిపరాశక్తి శ్రీ విజయ దుర్గా అమ్మవారి ఆధీనంలో ఉంటాయి కాబట్టి అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు నిర్వహించడం వలన అమ్మవారి అనుగ్రహం తప్పక లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.అందుకు నిదర్శనంగ ఆవిజయదుర్గా అమ్మవారు కూడా భక్తుల కోరికలను వెనువెంటనే నేరవేరుస్తున్నది.కాబట్టి ఈ పూజకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేస్తూ మొక్కులు తీర్చుకుంటూ ఆనందంగా ఉంటున్నారు. అలాగే ఈనెల 14 వ తేదీన శ్రీ విజయదుర్గామల్లికార్జునుల శాంతి కళ్యాణం వైభవంగా జరగనుంది,16 వ తేదీ జేష్టశుద్ధ విదియ నుండి జూలై 29 వ తేదీ ఆషాఢ పౌర్ణమి వరకు ఆలయంలో విజయదుర్గాదేవి మండలదీక్ష, మాలధారణ నిర్వహిస్తారు.కావున ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయ దుర్గాదేవి ఆశీస్సులు పొందాలని ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జున రావు,నిర్వాహకులు దుర్గా ప్రసాద్ తెలియచేశారు.

# సీఎంసీ ముట్టడించిన మున్సిపల్ కార్మికులు

## జీహెచ్ఎంసీ తరహా వేతనాలు అమలు చేయాలి.. విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికులకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి



శేరిలింగంపల్లి (బిఎన్ఎస్) : సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ (సీఎంసీ) పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మియాపూర్, శేరిలింగంపల్లి, అమీన్‌పూర్, రామచంద్రపురం, బాచుపల్లి, నిజాంపేట్, దుండిగల్, గుండ్లపోచంపల్లి, గండిమైసమ్మ, మేడ్చల్, కూకట్‌పల్లి ప్రాంతాలకు చెందిన మున్సిపల్ కార్మికులు భారీ సంఖ్యలో ధర్నా నిర్వహించారు.

మున్సిపాలిటీల నుంచి సీఎంసీలో విలీనమైన ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులకు జీహెచ్ఎంసీ తరహా వేతనాలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు, విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు అందజేశారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని నాయకులు కోరారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొంగరి కృష్ణ, నాగేశ్వరరావు, అశోక్, రాజశేఖర్, లింగస్వామి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులను ఆదుకుంటాను.

## నారా లోకేష్.



విశాఖపట్నం జూన్ 9(బిఎన్ఎస్) :విశాఖలో సెవెన్ హిల్స్ ఆసుపత్రికి వచ్చిన స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఐసీయూలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించి ఆదుకుంటామని ధైర్యం ఇచ్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నసూరిబాబు, పైడిరాజు, పి.శ్రీనివాసరావుకుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చిన మంత్రి నారా లోకేష్ హా మీ ఇచ్చారు.భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని చెప్పిన మంత్రి లోకేష్ అన్నారు. అక్కడ పరిస్థితులను వైద్య సదుపాయాలను, నారా లోకేష్ కు వంగలపూడి అనిత, భూపతిరాజు శ్రీనివాసవర్మలు వివరించారు.

# నవాబ్‌పేట్‌లో సీసీ రోడ్లను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



బిఎన్ఎస్, నవాబుపేట్ :నవాబుపేట్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను మాజీ శాసనసభ్యులు కే.ఎస్. రత్నం, గ్రామ సర్పంచ్ గాజులగూడెం నరసింహ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పత్తేపురం ప్రభాకర్ రెడ్డితో కలిసి ఘనంగా ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే కే.ఎస్. రత్నం ప్రత్యేక సహకారంతో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఈ మండలానికి మొత్తం రూ. 1,30,00,000 (కోటి ముప్పై లక్షలు) మంజూరు చేయగా, అందులో భాగంగా నవాబ్‌పేట్ గ్రామానికి కేటాయించిన రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మండల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ నిధులు మంజూరు చేసినందుకు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి నాయకులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ శ్రీశైలం, గ్రామస్తులు కల్యాణ్ రావు, జైపాల్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, బాలరాజు, కాంటెస్టెడ్ సర్పంచ్ మణికంఠ, లక్ష్మణ్, మండల అధ్యక్షులు చంద్రకాంత్, గాలయ్య, మహేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేశారు



కొత్తపేట, జూన్ 9 (బిఎన్ఎస్ ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కాలేజీలు, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేశారు కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి విమర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు , కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు పాటి శివకుమార్ పాల్గొన్నారు. జగన్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి రాష్ట్ర ప్రజలకు అందగా, చంద్రబాబు పాలనలో సంక్షోభం రాజ్యమేలుతోందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేశారని, మెగా డీఎస్సీ పేరుతో దళిత, బీసీ, మైనారిటీ యువతకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. హామీలకు సమాధి కట్టిన ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం నిలిచిపోయిందన్నారు.

కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట వైశ్యా కళ్యాణ మండపంలో నిర్వహించిన "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి చిర్ల జగ్గిరెడ్డి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చోటుచేసుకున్న అవినీతి, ప్రజావ్యతిరేక నిర్ణయాలు, సంక్షేమ పథకాల కోతలను ప్రజలకు వివరించారు. .

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులను చిర్ల జగ్గిరెడ్డి ఖండించారు. ఆరోగ్యశాఖ వైఫల్యాలు, మహిళలపై పెరుగుతున్న దారుణాలు, దివ్యాంగుల పెన్షన్ల తొలగింపు, నిరుద్యోగులను డీఎస్సీ పేరుతో మోసం చేయడం, విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడం వంటి అంశాలపై తీవ్ర విమర్శలు చేశారు. ఎస్సీ విద్యార్థుల హాస్టళ్లలో సరైన సదుపాయాలు లేకపోవడం, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దిగజారడం, రైతులను మోసం చేయడం, ఇసుక-- మట్టి దందాలను ప్రోత్సహించడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన యువతను, రైతులను కూటమి ప్రభుత్వం పూర్తిగా మోసం చేసిందని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 12వ తేదీన నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని చిర్ల జగ్గిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# మాజీ ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ పై చర్యలు తీసుకోండి.

## రూ.1.50 కోట్ల మోసం.. మాజీ ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ ఫొటోలు చూపిస్తూ బెదిరింపులపై గ్రీవెన్స్ లో ఫిర్యాదు



**అమరావతి, జూన్ 9(బిఎన్ఎస్) :** ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన సూరపనేని పద్మారాణి నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తమ కురుమద్దాలి గ్రామంలో ఉన్న 1 ఎకరం 33 సెంట్ల పొలాన్ని 2022 నవంబర్‌లో గుడివాడకు చెందిన చలసాని గణేష్ అనే వ్యక్తికి రూ. 1 కోటి 92 లక్షలకు విక్రయించాం. ఈ వ్యాపారంలో పామర్రుకు చెందిన నవుడు శ్రీలక్ష్మి (భర్త సింహాచలం), కలకోటి రామిరెడ్డి మధ్యవర్తులుగా ఉంటూ, ఏడాది కాలంగా కుటుంబంతో ఎంతో సన్నిహితంగా ఉంటూ నమ్మకం పెంపొందించుకున్నారు. పొలం అమ్మగా వచ్చిన డబ్బుతో పిల్లల పేరు మీద వేరే చోట భూమి కొందామని భావించాను. పామర్రు రాయల్ రెస్టారెంట్ ఎదురుగా మంచి పొలం తక్కువ ధరకే ఇప్పిస్తామని నమ్మించి, నవుడు శ్రీలక్ష్మి, రామిరెడ్డిలు కలిసి తన ఇంటి వద్ద రూ. 1,50,00,000 (కోటి యాభై లక్షల రూపాయలు) నగదు తీసుకున్నారు. తీరా డబ్బు తీసుకున్నాక ఎగ్రిమెంట్ చేయకుండా రకరకాల అబద్ధాలు చెప్తూ కాలయాపన చేశారు. చివరికి తనకు తెలియకుండా తాను ఇచ్చిన కోటిన్నర రూపాయల డబ్బుతో ఆ పొలాన్ని కలకోటి రామిరెడ్డి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకుని ఘోరంగా మోసం చేశారు. ఈ విషయంపై నిలదీయగా పెద్దల సమక్షంలో పంచాయితీ చేసి.. మొత్తం రూ. 1 కోటి 12 లక్షలకు గానూ కుటుంబ సభ్యుల పేరిట 4 ప్రామిసరీ నోట్లు రాసి ఇచ్చారు. తమ పేరిట రూ. 40,00,000, సూరపనేని భానుప్రకాష్ పేరిట రూ. 22,00,000, మల్లిపెద్ది శ్రీభార్గవి పేరిట రూ. 30,00,000, మల్లిపెద్ది శ్రీనివాస్ పేరిట రూ. 20,00,000, మిగిలిన రూ. 38 లక్షలు మూడు రోజుల్లో ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదు. ఇచ్చిన ప్రామిసరీ నోట్ల డబ్బులు కూడా ఇవ్వకుండా వేధించడంతో, తన కుమారుడు భానుప్రకాష్ తన రూ. 22 లక్షల నోటుపై లాయర్ ద్వారా కోర్టును ఆశ్రయించారు. కోర్టులో కేసు ఓడిపోవడంతో నవుడు శ్రీలక్ష్మి, కలకోటి రామిరెడ్డిలు రౌడీలుగా మారారు. “నన్నే కోర్టు మెట్లు ఎక్కిస్తావా? నీ కుటుంబాన్ని, నీ మనవళ్లను కిడ్నాప్ చేసి చంపేస్తాం, తుదముట్టిస్తాం” అంటూ తమ ఇంటికి వచ్చి బండబూతులు తిడుతూ తీవ్రంగా బెదిరిస్తున్నారు. తన వెనుక గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్ రౌడీషీటర్లు ఉన్నారని వైసీపీ పార్టీలో తనకు పెద్ద పదవి ఉందని, మాజీ ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ అండ తనకు ఉందని ఫోటోలు చూపిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని నేతలు ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్, జాతీయ అధికార ప్రతినిధి ఎన్. విజయ్ కుమార్ లకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

కర్నూలు జిల్లా తుగ్గలికి చెందిన చిన్న అంజినయ్య, చిరంజీవి,నెట్టికంటయ్య గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెంబర్ 92–దీ1లోని 5.20 ఎకరాలు, సర్వే నెం. 94–2 లోని 0.33 ఎకరాలు కలిపి మొత్తం 5.52 ఎకరాల భూమి కలదు. తమ తల్లిదండ్రుల మరణానంతరం తమ సొదరుడు ఎం. మేఘన్న అనే వ్యక్తి స్వార్థంతో గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో అప్పటి స్థానిక ఎమ్మెల్యే శ్రీదేవమ్మ అండచూసుకుని తమ దారుణంగా మోసం చేశాడు. ఎలాంటి ‘ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్’ (కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం) లేకుండానే, తానే ఒక్కడినే ఏకైక వారసుడినంటూ తప్పుడు పత్రాలు సృష్టించాడు. తమ తల్లి పేరు మీదున్న భూమిని అక్రమంగా తన పేరు మీదకు మార్పించుకుని పాసుపుస్తకం పొందాడు. ఈ భూమికి సంబంధించి ఆదోని సివిల్ కోర్టులో కేసు నడుస్తోంది. కోర్టు పరిధిలో ఉన్న భూమిని ఇతరుల పేరు మీదకు మార్చడం లేదా ఆన్‌లైన్ చేయడం చట్టరీత్యా నేరమని తెలిసినప్పటికీ, అప్పటి తుగ్గలి రెవెన్యూ అధికారులు అక్రమాలకు తెగబడ్డారు. నాటి తుగ్గలి రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎల్. సుధాకర్ రెడ్డి, రెవెన్యూ అధికారి శ్రీ సి. నాగేంద్ర, మండల తహసీల్దార్ ఇ. వెంకటలక్ష్మి గార్లు భారీగా లంచాలు తీసుకుని మేఘన్నతో చేతులు కలిపి ఈ అక్రమాలకు సహకరించారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులను కలిసి తమ సమస్యను పరిష్కరించాలని కోరగా.. వారు ప ట్టించుకోవడం లేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అన్నమయ్య జిల్లా సంబేపల్లికి చెందిన వీర ప్రతాప్, వెంకటరమణ, వీరయ్య, సంపూర్ణ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 100 లో చట్టబద్ధమైన ఇళ్ల పట్టాలు ఉన్నాయి. గతంలో ఇక్కడ కట్టుకున్న ఇళ్లు వర్షాలకు పడిపోవడంతో ప్రస్తుతం తాము మళ్లీ ఇళ్లు కట్టుకోవడానికి మట్టి, రాళ్లు తెచ్చుకుని పునాదులు వేసుకుంటున్నాం. అయితే, ఆ స్థలాల పక్కనే ఉన్న ప్రభుత్వ మిగులు భూమిని, తమ స్థలాలను కలిపి వైసీపీ నేత రావూరి రమేష్ అనే వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నాడు. తాము మొదటి నుండి తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు కావడం, గత ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయలేదనే కక్షతో రావూరి రమేష్ ఈ దౌర్జన్యానికి దిగాడు. దీనికి సంబేపల్లి వీఆర్వో పూర్తిగా అండగా నిలిచారు. తమ వద్ద అసలైన పట్టాలు ఉన్నప్పటికీ.. వీఆర్వో వైసీపీ నేత రమేష్‌తో చేతులు కలిపి తమ ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుంటున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పల్నాడు జిల్లా మాచర్ల మండలం బెల్లంకొండవారిపాలెం గ్రామానికి చెందిన సుశీల గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ తల్లిదండ్రులైన మామిళ్ళ సీతమ్మ, రామయ్య గార్లు గత 23/10/2009 న మాచర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ పేరిట ఒక ఇంటి స్థలాన్ని, 4 ఎకరాల 33 సెంట్ల భూమిని రిజిస్టర్ చేయించారు. మరికొంత పొలానికి అగ్రిమెంట్ కూడా రాసిచ్చారు. రిజిస్ట్రేషన్ సమయంలో తమ వదిన రాఘవమ్మ ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. అయితే గత ప్రభుత్వ హయాంలో తాము ఇంట్లో లేని సమయం చూసి, రాఘవమ్మ కుమారుడైన నాగరాజు కొడవళ్లు, కత్తులతో వచ్చి తనను చంపుతామని బెదిరించాడు. ఇంట్లోని ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, పట్టాదారు పాస్ పుస్తకాలను బలవంతంగా ఎత్తుకెళ్లాడు. దీనిపై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత స్థానిక వీఆర్వో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి తన పేరిట ఉన్న రిజిస్టర్డ్ పొలాన్ని పాస్ పుస్తకాల ఆధారంగా అక్రమంగా వారి పేరు మీదకు మార్చేశారు. ఈ విషయమై ప్రశ్నించినందుకు... శిరిమామిళ్ళ మంగమ్మ, వెంకటేశ్వర్లు, పచ్చల మురళీబాబు, వెంకట్రావు, విజయలక్ష్మి, రాహుల్ అనే వ్యక్తులు తమ ఇంటిపైకి వచ్చి దుర్భాషలాడారు. “నీకు పొలం ఎక్కడిది? ఇల్లు, పొలాలు మావి, ఇక్కడి నుంచి వెళ్ళిపో” అంటూ బెదిరించారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం వేంపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలోని సర్వే నెం. 1942–1 లో గల 4.84 ఎకరాల భూమి తన తండ్రి దేవన రంగప్ప పేరు మీద పట్టా మంజూరైంది. తండ్రి కాలం నుండి నేటి వరకు ఆ భూమి తమ కుటుంబం స్వాధీనంలోనే ఉంది. అందులో వర్షాధార పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నాం. అయితే ఇటీవల తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కనీసం సమాచారం కూడా లేకుండా డి. వెంకటరమణ భార్య అయిన డి. రామక్క అనే మహిళ ఆ భూమిని తన పేరున ‘1బి ఖాత్ నెం. 2149’ గా ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు చేయించుకున్నారు. ఈ విషయమై స్థానిక రెవెన్యూ అధికారులను ఆశ్రయించగా, వారు ఎలాంటి సరైన సమాధానం గానీ, ఆధారాలు గానీ చూపించలేదు. ప్రస్తుతం ఆ భూమి క్షేత్రస్థాయిలో తమ స్వాధీనంలోనే ఉంది. తమ కుటుంబానికి ఆ ఒక్క భూమి తప్ప ఎలాంటి ఆస్తులు లేవని, వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నామని తెలిపారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

సత్యసాయి జిల్లా తలుపుల మండలం ఓరుపల్లి గ్రామానికి చెందిన గంగమ్మ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెంబర్ 264–1 లోని భూమిని స్వయంగా సాగు చేసుకుంటూ, కష్టపడి వ్యవసాయం చేసుకుంటున్నాను. అయితే స్థానికంగా ఉండే ఆర్. నాగరాజు, ఆర్. రమణ, ఆర్. గోవిందమ్మ అనే వ్యక్తులు తన అమాయకత్వాన్ని, అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని, తనకు తెలియకుండా సదరు భూమిని వారి పేర్ల మీదకు మార్పించుకున్నారు. రికార్డుల్లో పేర్లు మారినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఈనాటికీ ఆ భూమి తన సాగులోనే ఉందని, తానే కష్టపడి పండించుకుంటున్నాను. సర్వే నెంబర్ 264 లో భూమి ఒకరి సాగులో ఉంటే, మరొకరికి పట్టా ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన దావీదు రాజు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తన తండ్రి లేట్ ఇ.ఎస్.రాజు గారు ఆర్మీలో (75వ రెజిమెంట్) దేశానికి సేవ చేసి రిటైర్ అయ్యారు. ఆయన మిలటరీ సేవలను గుర్తించిన ప్రభుత్వం.. మైలవరం మండలం, చంద్రగూడెం జంగాలపల్లి గ్రామంలోని సర్వే నెం. 163/3 లో 2.50 ఎకరాల భూమిని మంజూరు చేస్తూ ‘డి ఫారం’ పట్టా ఇచ్చింది. నాటి నుండి ఆ భూమి తమ హక్కులోనే ఉండేది. తండ్రి ఇ.ఎస్.రాజు గారు రిటైర్ అయ్యాక, 2000 సంవత్సరంలో ఆ భూమి వద్దకు వెళ్లి సాగు పనుల కోసం ఏర్పాట్లు చూసుకున్నారు. అయితే 2001లో భూమిలో పంట వేసేందుకు సిద్ధమై ప్రభుత్వ భూ రికార్డులను (అడంగళ్) పరిశీలించగా.. ఆ రికార్డుల్లో మాజీ సైనికుడు ఇ.ఎస్.రాజు పేరును తొలగించి, పేముల మేరీ కమలాబాయి (భర్త జీవరత్నం) అనే మహిళ పేరును అక్రమంగా నమోదు చేశారు. దీనిపై అప్పట్లోనే అధికారులను సంప్రదించినా స్పందన లేదు. ఆ మనస్తాపంతోనే 2004లో తన తండ్రి ఇ.ఎస్.రాజు కన్నుమూశారు. తండ్రి మరణించిన నాటి నుండి నేటి వరకు న్యాయం కోసం ఎందరో అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. కావున తమయందు దయవుంచి తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం సి. పులిమెరపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామ పరిధిలో పట్టా నంబరు 170 లో చట్టబద్ధమైన వ్యవసాయ భూమి ఉంది. అయితే తమ పొలం పక్కనే భూమి ఉన్న చెన్నకృష్ణారెడ్డి అనే వ్యక్తి తనకున్న రాజకీయ పలుకుబడిని, బలాన్ని ఉపయోగించి తమకు చెందిన భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడు. పొలంలో సొంత ఖర్చులతో వేసుకున్న నీటి బోర్లు ఉన్నాయి. అయితే ఆక్రమణదారుడు చెన్నకృష్ణారెడ్డి ఆ బోర్ల నుండి తమను నీరు వాడుకోకుండా అడ్డుకుంటూ, పంటలు ఎండిపోయేలా చేస్తూ తీవ్ర ఆర్థిక నష్టానికి, మానసిక ఆందోళనకు గురిచేస్తున్నాడు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

పార్వతీపురంమన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం నీచుకవలస గ్రామానికి చెందిన శ్రీనాధనాయుడు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. సర్వే నంబర్ 82 లోని భూమిని గత ప్రభుత్వ హయాంలో కొందరు స్థానిక అధికారులు, సిబ్బంది ప్రోత్సాహంతో అక్రమంగా వేరే వ్యక్తుల పేర్లపై రికార్డులు మార్చడం జరిగింది. పాత ఎల్పీ నంబర్ల స్థానంలో కొత్తగా ఎల్పీ నంబర్లు సృష్టించి, తమ కుటుంబానికి చెందిన భూమిని ఇతరుల పేరిట రిజిస్టర్ చేశారు. తను 1981 నుండి హైదరాబాద్‌లో నివసిస్తున్నాను. తాము మొత్తం 14 మంది అన్నదమ్ములు. తమ పూర్వీకుల నుండి వచ్చిన భూమి, ఇల్లు, ఇతర ఆస్తులను అందరికీ సమానంగా పంచుకోవాలని భావించిన తరుణంలో ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. 2010 నాటి రికార్డుల ప్రకారం ఎవరి భూమి తమ ఆధీనంలోనే ఉన్నప్పటికీ, గత ప్రభుత్వంలో జరిగిన కొన్ని రాజకీయ, వ్యక్తిగత కుట్రల కారణంగా తమ భూమిని లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

---

## ఉపాధిహామీ కార్మికులకు పాలా మజ్జిగ పంపిణీ



**వేంసూరు,జూన్09(బిఎన్ఎస్) న్యూస్:**

ఖమ్మంజిల్లా సత్తుపల్లి నియోజకవర్గం వేంసూర్ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కార్మికులకు ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేందుకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాలా వెంకటరెడ్డి ప్రతిరోజూ మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కార్మికులను స్వయంగా కలిసి మజ్జిగ అందజేస్తూ వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నారు.

వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా కార్మికులు ఇబ్బందులు పడకుండా, దాహార్తిని తీర్చడంతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పాలా వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.స్థానిక నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని కార్మికులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేశారు. ఎండల తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

---

## మంత్రి తుమ్మలకు ఆర్యవైశ్య మహాసభ ఆహ్వానం



సత్తుపల్లి, ఆర్ సి,జూన్ 9(బిఎన్ఎస్) న్యూస్ : హైదరాబాద్‌లో ఈ నెల 12న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఆర్యవైశ్య ప్రజాప్రతినిధుల అభినందన సభ, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆర్యవైశ్య మహాసభ నాయకులు ఆహ్వానించారు. దమ్మపేట మండలంలోని గండుగులపల్లి గ్రామంలో మంగళవారం మంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో హైదరాబాద్ చంపాపేటలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పసుమర్తి చంద్రరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దారా రమేష్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసి కార్యక్రమ విశేషాలను వివరించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, పులిపాటి ప్రసాద్, కార్యదర్శి పెండ్యాల విజయభాస్కర్, రాజకీయ వ్యవహారాల కమిటీ ఉపాధ్యక్షుడు నూకల శ్రీనివాసరావు, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గోళ్ళ రాధాకృష్ణమూర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుగూరి నగేష్‌కుమార్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గంగిశెట్టి గంగాధర్ జగదీశ్‌కుమార్, పాల్వాయి వెంకటేశ్వరరావు, చారుగుండ్ల నరసింహమూర్తి, దారా మల్లికార్జునరావు, మాశెట్టి వరప్రసాద్, డాక్టర్ పెరుమాళ్ల కృష్ణమూర్తి, వజినేపల్లి చక్రధర్‌రావు, పసుమర్తి గోపాలరావు, పాల్వాయి సీతయ్య, గుండు ఉమా, కాజా చక్రధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

---

## కొమురం భీమ్ విగ్రహ ఆవిష్కరణకు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు ఘన స్వాగతం

**బిఎన్ఎస్ న్యూస్ చర్ల, జూన్ 9**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కేశపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన కొమురం భీమ్ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చర్ల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన వీరుడు కొమురం భీమ్ సేవలను స్మరించుకున్నారు. గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కొమురం భీమ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధికి ఆయన చూపిన మార్గం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

## కిష్టారం గనుల సమస్యలపై ఎల్ హెచ్ పి ఎస్ సింగరేణి అధికారికి వినతిపత్రం”



సత్తుపల్లి, ఆర్ సి,జూన్ 9(బిఎన్ఎస్) న్యూస్: కిష్టారం బహిరంగ గనిలో జరుగుతున్న పేలుళ్ల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నివారించడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు మంగళవారం సత్తుపల్లి సింగరేణి ప్రధాన అధికారికి వినతిపత్రం అందజేశారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నందు నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్ నాయక్, పండు నాయక్ తదితరులు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి గనులు వస్తే స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని ఆశించినప్పటికీ ఆశించిన స్థాయిలో అవకాశాలు కల్పించడం లేదన్నారు. గనులు, మట్టి తొలగింపు పనులను నిర్వహిస్తున్న కాంట్రాక్టు సంస్థలు ఇతర రాష్ట్రాల కార్మికులను నియమించుకుంటున్నాయని ఆరోపించారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే మరిన్ని కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు.

సత్తుపల్లి ప్రాంతంలో బొగ్గు ఉత్పత్తి ప్రధానంగా బహిరంగ గనుల ద్వారానే జరుగుతున్నందున సంస్థల సామాజిక బాధ్యత నిధులతో ప్రభావిత గ్రామాలు, పట్టణాలను అభివృద్ధి చేయాలని కోరారు. కిష్టారం బహిరంగ గనిలో పరిమితికి మించి పేలుళ్లు నిర్వహించడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. గ్రామాల్లో ఇళ్లకు నష్టం వాటిల్లే ప్రమాదం, వ్యవసాయ భూములు బీడుగా మారే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

అందువల్ల ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న అంశాలపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు.